చీకట్లో శివారు ప్రాంతాలు

- భయం గుప్పిట్లో ప్రజలు
- చీకటిలోనే గంజాయి దందా
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా గ్రామ శివారులు
- పోలీసులు దాడులు చేస్తున్నా ఆగని ఘటనలు
- ప్రతిరోజూ వాహన ప్రమాదాలు
- ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేసినా మరమ్మతులు మరిచిన వైనం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని ప్రధాన రహదారులపై ఉన్న శివారు ప్రాంతాలు చీకట్లో మగ్గుతున్నాయి. గ్రామ శివారులోని సుమారు రెండు కిలోమీటర్ల మేర ఎల్‌ఈడీ కాంతులతో విద్యుత్ సౌకర్యాన్ని కల్పించాల్సి ఉండగా, అటు అధికారులు, ఇటు పంచాయతీ పాలకవర్గాలు పట్టించుకోవడం లేదు. ఫలితంగా చీకటిలో ప్రజలు ఇబ్బంది పడుతూ భయం.. భయంగా కాలం వెల్లదీస్తున్నారు. మండల కేంద్రంతో పాటు నారాయణపూర్ శివారు, రాచర్ల గొల్లపల్లి, వెంకటాపూర్, రాచర్ల తిమ్మాపూర్ శివారు ప్రాంతాల్లో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. పోలీసులు పలుసార్లు దాడులు చేసి మద్యంబాబులను పట్టుకున్నారు. దీనికి తోడు చీకట్లో డివైడర్లు కనిపించక ప్రతిరోజు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.



చీకటిమయమైన ఎల్లారెడ్డిపేట శివారు ప్రాంతం

ప్రధాన రహదారిపైనే సమస్యలు

ప్రధానంగా సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారిపై గల వెంకటాపూర్, హరిదాస్‌నగర్, పదిర, రాగట్లపల్లి, ఎల్లారెడ్డిపేట, రాచర్ల తిమ్మాపూర్‌తో పాటు నారాయణపూర్, బండలింగంపల్లి, దూమాల, అల్మాస్‌పూర్, రాజన్నపేట గ్రామ శివారులో ఎల్‌ఈడీ విద్యుత్ లైట్లు గ్రామం నుంచి రెండు కిలోమీటర్ల వరకు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. విద్యుత్ లైట్లను మొదట్లో ఏర్పాటు చేసినప్పటికీ, వాటిని తరుచుగా మరమ్మతు చేయడం మరిచారు. అనేక రోడ్లలో గతంలో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ లైట్లు కాలిపోవడంతో కొత్తవి బిగించని కారణంగా మళ్లీ చీకట్లోనే రహదారులు మగ్గుతున్నాయి. పంచాయతీ పాలకవర్గాలు విద్యుత్ దీపాల మరమ్మతులకు నిధులు లేవని చెప్తుండగా, అటు సెస్ అధికారులు సంస్థ నుంచి ఎలాంటి నిధులు కేటాయించడం లేదు. దీంతో శివారు ప్రాంతాల్లో చీకటి ఎవరికి పట్టని సమస్యగా మారింది.

అసాంఘిక కార్యకలాపాలకు నెలవు

మండల కేంద్రం శివారులో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రైవేట్ డిగ్రీ కళాశాల ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలు నిత్యకృతయమయ్యాయి. మద్యం సేవించేందుకు చీకట్లో కొన్ని ప్రాంతాలు అడ్డాలుగా మారాయి. ముఖ్యంగా యువత శివారు ప్రాంతాలలోనే గంజాయి సేవిస్తున్నట్లు ఫిర్యాదులున్నాయి. పోలీసులకు సమాచారం అందడంతో దాడులు చేస్తున్నప్పటికీ ఫలితం లేకుండా పోతోంది. చీకటి కావడంతో ఎవరు రారనే ధీమాతో అసాంఘిక కార్యకలాపాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. పోలీసులు రాత్రి 11 గంటల తర్వాత పెట్రోలింగ్ చేస్తున్నా మార్పు రావడం లేదు. శివారు ప్రాంతాల్లో చీకట్లోనే కొన్ని ఇళ్లు ఉండడంతో ఇలాంటి చర్యలతో వారు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఎల్లారెడ్డిపేట నుంచి రాచర్ల గొల్లపల్లి శివారు వరకు ప్రధాన రహదారి వెంట విద్యుత్ లైట్లను ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఇప్పటికైనా పంచాయితీ పాలకవర్గాలు, సెస్ అధికారులు స్పందించి శివారు ప్రాంతాల్లో ఎల్‌ఈడీ విద్యుత్ లైట్లు ఏర్పాటు చేస్తే తప్ప సమస్యలు పరిష్కారం కావని మండల ప్రజలు భావిస్తున్నారు.

ఎల్‌ఈడీ లైట్లను మరమ్మతు చేయాలి



నారాయణపూర్ నుంచి మండల కేంద్రానికి వెళ్లేందుకు చీకట్లోనే ప్రయాణం చేయాల్సి వస్తోంది. రెండు గ్రామాల మధ్య గతంలో ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేశారు. లైట్లు ఉన్నప్పటికీ వాటిని మరమ్మతు చేయడం మరిచారు. దీంతో మళ్లీ చీకట్లోనే ప్రయాణం చేయాల్సి వస్తోంది. ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి.

– మోతే మధుసూదన్‌రెడ్డి, నారాయణపూర్

గట్టి నిఘా ఏర్పాటు చేశాం



శివారు ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తమకు సమాచారం ఉంది. పోలీసులు ప్రతిరోజూ గ్రామ శివారు ప్రాంతాల్లో పెట్రోలింగ్ చేస్తున్నారు. దాడులు చేసి గంజాయి విక్రేతలు, తాగుబోతులను పట్టుకున్నాం. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై కేసు నమోదు చేశారు. ఈ ప్రాంతాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేశాం.

– శేఖర్, ఎస్‌ఐ, ఎల్లారెడ్డిపేట

క్లుప్తంగా

అనంతారం పెద్దచెరువులోకి నీరు విడుదల



అనంతారం పెద్దచెరువులోకి వెళ్తున్న నీరు

ఇల్లంతకుంట: మండలంలోని అనంతారం పెద్దచెరువులోకి అనంతగిరి అన్నపూర్ణ రిజర్వాయర్ ద్వారా 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డీఈఈ శ్రీనివాసరావు తెలిపారు. డీ–1 కెనాల్ ద్వారా 50 క్యూసెక్కులు, సర్ఫేస్ గేట్ల ద్వారా 150 క్యూసెక్కుల నీటిని అనంతారం పెద్ద చెరువులోకి విడుదల చేసి మత్తడి ద్వారా బిక్కవాగు, రహీంఖాన్‌పేట సింగరాయ చెరువులకు నీరు వెళ్తున్నట్లు తెలిపారు.

పంచాయతీ భవనానికి భూమిపూజ



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ కవిత

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని లింగంపల్లి గ్రామ పంచాయతీ నూతన భవనానికి సర్పంచ్ సామ కవిత భూమిపూజ చేశారు. పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరుకోగా నూతన భవనం నిర్మాణానికి ఎమ్మెల్యే రమేశ్‌బాబు, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎరవెల్లి దయాకర్‌రావుకు విన్నవించగా రూ.20 లక్షలు మంజూరు చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పుల్లూరి ప్రేమల, కార్యదర్శి ప్రేమ్‌చంద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ప్రజాప్రతినిధులు



ఎస్పీకి బొకే అందిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

బోయినపల్లి: ఎస్పీ అఖిల్ మహాజన్‌ను సోమవారం బోయినపల్లి ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, జెడ్పీటీసీ కత్తెరపాక ఉమ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. వారి వెంట వైస్‌ఎంపీపీ కొనుకటి నాగయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య ఉన్నారు.

వైద్య విద్యార్థినికి కొవ్వొత్తులతో నివాళి



చందుర్తి: మల్యాలలో నివాళి అర్పిస్తున్న యువత

చందుర్తి/సిరిసిల్లకల్చరల్/వీర్నపల్లి: సీనియర్ల వేధింపుల కారణంగా ఆత్మహత్యకు పాల్పడిన మెడికో విద్యార్థిని ధరావత్ ప్రీతి, హత్యకు గురైన నేనావత్ నవీన్ మృతికి సంతాపంగా చందుర్తి మండలం మల్యాల గ్రామం, వీర్నపల్లి మండలం జవహర్‌లాల్ నాయక్ తండా, సిరిసిల్ల అంబేడ్కర్ సర్కిల్‌లో ఉపాధ్యాయ జేఏసీ సారథ్యంలో సోమవారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీని నిర్వహించి, వారి చిత్రపటాలకు నివాళి అర్పించారు. వీరి మృతికి బాధ్యులైన వ్యక్తులను ఉరితీయాలని కోరారు,



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

ఇల్లంతకుంట: వరంగల్ కేఎంసీలో వైద్య విద్యార్థి ప్రీతి మృతికి నిరసనగా స్థానిక బస్టాండ్ ఆవరణలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ దళిత మోర్చా మండల ప్రధాన కార్యదర్శి మామిడి హరీశ్ మాట్లాడుతూ ప్రీతి మృతికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. నిందితుడికి ఉరిశిక్ష పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు సంతోష్, ప్రసన్న, అఖిల్, ప్రశాంత్, శ్రీను పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



ఎండుతున్న మొక్కలు

వేములవాడరూరల్: రోడ్లకు ఇరువైపులా నాటేందుకు హరితహారం మొక్కలు పెంచిన అధికారులు వాటిని తీసుకువచ్చి నాటకుండానే నిర్లక్ష్యంగా వదిలేశారు. వేములవాడ మార్కెట్ యార్డులో ఎన్నో రోజులుగా ఉన్నా మొక్కలు నాటకుండా వదిలివేయడంతో ఎండకు ఎండిపోతున్నాయి.

ప్రశ్నించాల్సిన అధికారి: అన్వేశ్, మున్సిపల్ కమిషనర్, వేములవాడ
ఫోన్ నంబర్: 70366 84716

సమాచారం

3న మండల సర్వసభ్య సమావేశం

కోనరావుపేట: మండల సర్వసభ్య సమావేశాన్ని మార్చి 3న ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్యగౌడ్ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

ఆధ్యాత్మికం

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభం



పూజ చేస్తున్న పండితులు

బోయినపల్లి: మండలంలోని నర్సింగాపూర్‌లో త్రయాహ్నిక ఏకకుండాత్మక సీతాలక్ష్మణ హనుమత్సమేత శ్రీరామచంద్ర, ఆళ్వార్ ఆచార్య ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. సోమవారం అగ్నిప్రతిష్ఠ, చతుస్నానార్చన, మూలమంత్ర హవనం, శ్రీవిష్ణుసహస్రనామ పారాయణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ జోగినిపల్లి ప్రేమ్‌సాగర్‌రావు, జోగినిపల్లి అజిత్‌రావు, ఆదిత్యరావు శ్రీ సీతారామ దేవస్థానం ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

వైద్యం- ఆరోగ్యం

కంటి వెలుగు శిబిరం



కళ్లద్దాలు అందిస్తున్న ఎంపీపీ పడిగెల మానస

సిరిసిల్లఅర్బన్: మండలంలోని సారంపల్లి గ్రామంలో కంటి వెలుగు కేంద్రాన్ని ఎంపీపీ పడిగెల మానస సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొయ్యాడ రమేశ్, సింగిల్‌విండో వైఎస్ చైర్మన్ వెంకటరమణారెడ్డి, ఎంపీటీసీ లావణ్య, వైద్యాధికారిణి రేఖ, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆవునూరులో..

ముస్తాబాద్: మండలంలోని ఆవునూర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ జనగామ శరత్‌రావు సోమవారం ప్రారంభించారు. జెడ్పీటీసీ గుండం నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, సర్పంచ్ బద్ది కల్యాణి, ఎంపీటీసీ లలిత, వైద్యాధికారిణి గీతాంజలి, భాను, క్రాంతి, సతీష్‌చందర్, విశ్వనాథ్, స్వామి పాల్గొన్నారు.

స్వగ్రామంలో వైద్యాధికారిణికి సన్మానం

ముస్తాబాద్ వైద్యాధికారిణిగా నియమించబడిన గీతాంజలిని ఆవునూర్ గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఆవునూర్‌కు చెందిన గీతాంజలి జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యాభ్యాసం చేసి, ఎంబీబీఎస్ పూర్తి చేసినట్లు సర్పంచ్ బద్ది కల్యాణి తెలిపారు. ఆవునూర్ గ్రామ ప్రజలకు గర్వకారణంగా నిలిచిన ఆమెను స్ఫూర్తిగా అందరూ శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు.

పశువుల చెంతకు వైద్య సేవలు

- ఆరు మండలాలు, నలుగురు సిబ్బంది
- వేతనాలు అంతంత మాత్రమే



పశువుకు వైద్యం చేస్తున్న పశు సంచార సిబ్బంది

వేములవాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వం పశువులకు వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేకంగా పశు సంచార వైద్యశాల పేరుతో గ్రామీణ ప్రాంతాల్లో సేవలందిస్తోంది. దీనికి గాను ప్రత్యేక సిబ్బందికి శిక్షణ ఇచ్చి పశువుల వద్దకే వాహనంతో వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. పశువులు ఏ సమయంలో అనారోగ్యబారిన పడిన వెంటనే వారికి ఫోన్ చేయడంతోనే వారి వద్ద ఉంటున్నారు. కానీ ప్రభుత్వం తమకు ఇవ్వాల్సిన వేతనాలు అంతంతమాత్రంగానే ఉన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేములవాడ నియోజకవర్గంలో వేములవాడ, వేములవాడరూరల్, కోనరావుపేట, చందుర్తి, బోయినపల్లి, రుద్రంగి ఆరు మండలాలకు ఒకే వాహనం సేవలందిస్తోంది. ఇందులో నలుగురు సిబ్బంది ప్రత్యేకంగా కాంట్రాక్టు పద్ధతిన విధులు నిర్వహిస్తున్నారు. కొన్నేళ్లుగా విధులు నిర్వహించినా వీరికి వేతనాలు మాత్రం రావడం లేదని తెలిసింది. ఇందులో పనిచేసే సిబ్బంది కూడా నియోజకవర్గ కేంద్రంలో వసతి సౌకర్యం లేక వాహనాలను ప్రభుత్వ కార్యాలయాల సమీపంలోనే ఉంచుతున్నారు. దూర ప్రాంతాల నుంచి ప్రయాణం చేస్తూ విధులకు హాజరవుతున్న వీరికి ప్రత్యేకంగా వసతి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

ఫోన్ కొట్టగానే వస్తారు



మా పశువులకు ఎలాంటి బీమారి వచ్చినా ఈ డాక్టర్లకు ఫోన్ కొట్టగానే వస్తారు. గతంలో చాలా సార్లు మా పశువులకు పరీక్షలు చేశారు. చేను వద్దకే వచ్చి వాటికి మందులు ఇస్తున్నారు. గతంలో పశువులకు వ్యాధి వస్తే ఇబ్బంది పడేవారం. ఇప్పుడు అలాంటి బాధలు లేవు.

– సాగర్ల పెద్ద నర్సయ్య, రైతు, పోచెట్టిపల్లి

పశు సేవ చేయడం ఆనందం



పశువులకు వైద్యం చేయడం ఎంతో ఆనందం అనిపిస్తది. ఆరు మండలాలకు ప్రస్తుతం మా సంచార వైద్యశాల తరుపున సేవలందిస్తున్నాం. మా వాహనంలో నలుగురు సిబ్బందితో పాటు మందులు ఎప్పుడూ అందుబాటులో ఉంటాయి.

– ప్రేమ్‌చంద్,
సంచార పశువైద్యాధికారి, వేములవాడ

కేసీఆర్‌నగర్ కాలనీలో సమస్యలు పరిష్కరించాలి



ఏవోకు వినతిపత్రం ఇస్తున్న కాలనీ వాసులు

సిరిసిల్లటౌన్: మండలం మండేపల్లిలోని కేసీఆర్‌నగర్ కాలనీలో సమస్యలు వెంటనే పరిష్కరించాలని కలెక్టరేట్‌లో కాలనీవాసులు సోమవారం వినతిపత్రం సమర్పించారు. మండల సీపీఎం ఆధ్వర్యంలో కాలనీవాసులు తరలివచ్చారు. 1,280 డబుల్ బెడ్రూం ఇళ్లు గల కేసీఆర్ కాలనీకి జిల్లా కేంద్రం నుంచి బస్సు సౌకర్యం లేదని తెలిపారు. ఆస్పత్రి, పాఠశాల, శ్మశానవాటిక, అంగన్‌వాడీ కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మూశం శంకర్, సామల కవిత, నక్క దేవదాసు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీలో విద్యార్థుల ప్రతిభ



సాధించిన పతకాలతో విద్యార్థినులు

గంభీరావుపేట: సుమన్ షోటోకాన్ కరాటే డూ ఇండియా ఆధ్వర్యంలో వరంగల్‌లో సోమవారం నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే, కుంగ్‌ఫూ పోటీల్లో గంభీరావుపేట కేజీబీవీ విద్యార్థులు, ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థిని అత్యంత ప్రతిభ కనబరిచారు. కేజీబీవీ విద్యార్థులు 9 మంది బంగారు, ఏడుగురు వెండి, ఏడుగురు రజత పతకాలను, ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌కు చెందిన ఉషశ్రీ రజత పతకాన్ని సాధించినట్లు కోచ్ విక్రమ్ తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థినులను నటుడు సుమన్, ఆర్గనైజర్లు అభినందించినట్లు తెలిపారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

ఎల్లారెడ్డిపేట: మహిళలు సృజనాత్మకతతో ఆర్థికాభివృద్ధి సాధించాలని జన వికాస గ్రామీణ అభివృద్ధి సంస్థ కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. మంత్రి కేటీఆర్ దత్తత గ్రామమైన రాజన్నపేటలో ఫ్యాషన్ డిజైనింగ్‌లో శిక్షణ పొందిన మహిళలను సోమవారం సిరిసిల్లలోని గ్రీన్ నీడిల్ పర్యటనకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు స్వశక్తితో అభివృద్ధి సాధించాలన్నారు. ఫ్యాషన్ డిజైనింగ్‌పైనే మహిళలు ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు. గ్రామంలో డెమో యూనిట్లు కూడా త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. నాబార్డు ద్వారా ఏర్పాటు చేసే గ్రామీణ ఉత్పత్తుల విక్రయ కేంద్రం రూరల్ మార్ట్‌లాంటి కార్యక్రమాల ద్వారా స్వశక్తి మహిళలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. వారు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించేందుకు అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ముక్క శంకర్, సీసీ పద్మ, శిక్షకులు మనీషా, వీవోఏలు, 90 మంది మహిళలు ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న సంపత్‌కుమార్

పశువైద్య శిబిరం ప్రారంభం



ఎల్లారెడ్డిపేట: మండలంలోని అల్మాస్‌పూర్, రాచర్ల గుండారం, ఎల్లారెడ్డిపేట గ్రామాల్లో సోమవారం పశువైద్య శిబిరాలను ఎంపీపీ పిల్లి రేణుక ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచులు రాధరపు పుష్పల, భాక్య శంకర్ నాయక్, నేవూరి వెంకట్‌రెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఏంపీటీసీ పందిర్ల నాగరాణి, పశువైద్యాధికారిణి రేణుక పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు..

ఇల్లంతకుంట: మండలంలోని వల్లంపట్ల గ్రామంలో ఉపాధి హామీ నిధుల ద్వారా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను సర్పంచ్ కేతిరెడ్డి అనసూయ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ స్రవంతి, మాజీ సర్పంచ్ కళాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఫెడరేషన్‌కు విరాళం

కోనరావుపేట: మండలం నిజామాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫెడరేషన్ సొసైటీ గ్రంథాలయానికి గ్రామానికి చెందిన జంగిలి దేవయ్య రూ.5 వేల విరాళాన్ని సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ కమిటీ సభ్యులు అంగూరి సుధాకర్, మాదాసు భూమయ్య, బంటు లచ్చయ్య, భూమయ్య, భూమయ్య పాల్గొన్నారు.

పంచాయతీ భవనాలకు స్థల పరిశీలన

కోనరావుపేట: మండలంలోని సైసేవాలాల్ భుక్యారెడ్డి తండా, వట్టిమల్ల గ్రామాల్లో గ్రామపంచాయతీ భవనాల నిర్మాణం కోసం సోమవారం స్థల పరిశీలన చేశారు. మండలంలోని ఆయా గ్రామాల్లో నూతన గ్రామపంచాయతీ భవనాల కోసం ఉపాధి హామీ పథకం నుంచి రూ.20 లక్షల చొప్పున మంజూరయ్యాయి. ఈ భవనాల ఏర్పాటు కోసం ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్య, ఎంపీడీవో రామకృష్ణ సోమవారం పరిశీలించారు. వారి వెంట తహసీల్దార్ నరేందర్, సింగిల్‌విండో చైర్మన్ బండ నర్సయ్య, టీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

వీర్నపల్లి: మండలంలోని బంజేరు గ్రామ పంచాయితీ ఆవరణలో బట్టు రజితకు రూ.52,500 సీఎంఆర్‌ఎఫ్ చెక్కును సర్పంచ్ గుగులోతు కళ సోమవారం అందజేశారు. బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఎండి రఫీ, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మల్యాల అశోక్, ఆర్‌బీఎస్ జిల్లా సభ్యుడు బట్టు రతిలాల్ పాల్గొన్నారు.

విద్యా వార్త

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న విద్యార్థులు

బోయినపల్లి: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో రాష్ట్రీయ ఆవిష్కార్ వారోత్సవాల పోస్టర్‌ను సోమవారం పాఠశాల విద్యార్థులు ఆవిష్కరించారు. వారోత్సవాల సందర్భంగా 6 నుంచి 12వ తరగతి విద్యార్థులు మట్టి నమూనాలు సేకరించి వాటి ఆకృతిని, నేల ఆరోగ్యాన్ని విశ్లేషిస్తారని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నిమ్మల సుధాకర్ తెలిపారు. అలాగే నేల స్వభావం, నేల నీటిని పట్టుకునే సామర్థ్యం, అధిక సాంద్రతను నిర్ణయిస్తారని వివరించారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు మునీరొద్దిన్, సునిత, కవిత, నరేశ్‌సాయి, తదితరులు పాల్గొన్నారు.